గురుకులంలో లొల్లి

- సీనియర్లు వర్సెస్ జూనియర్లు
- విద్యార్థుల మధ్య తరచూ గొడవలు
- కొరవడిన క్రమశిక్షణ
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు



కళాశాల భవనం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల బాలుర కళాశాల సమస్యలకు నిలయమైంది. విద్యార్థుల మధ్య జరుగుతున్న అంతర్గత గొడవలతో, కొంతమంది విద్యార్థులు కళాశాల నుంచి టీసీలు తీసుకుని వెళ్లిపోతున్నారు. తోటి విద్యార్థులలో కలిసిమెలిసి ఉండాల్సిన సీనియర్ విద్యార్థులు చెలరేగిపోతూ, రాత్రిపూట విచక్షణ రహితంగా ప్రవర్తిస్తున్నారు. రాత్రి అయిందంటే చాలు, మిగితా విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడడం, సిగరేట్ కాల్చడం, తోటి విద్యార్థుల వస్తువులు దొంగిలించడం, సెల్‌ఫోన్‌ను వాడటం, భవనం కిటికీల అద్దాలు పగులగొట్టడం, పడుకున్న తరువాత లైట్లుఆర్పి కొట్టడం, ఉదయం ఎవరికీ చెప్పవద్దని బెదిరించడం చేస్తున్నారని తెలిసింది. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులపై ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తూ, యజమాయిషీ చేస్తున్నారు. తరచూ ఏదో ఒక గొడవ కళాశాలలో జరుగుతూనే ఉంటుంది, బయటకు రాని సమస్యలు ఇంకా చాలా ఉన్నాయని అంటున్నారు. విద్యాబుద్ధులు నేర్చుకుని ప్రయోజకులవుతారని చూస్తున్న తల్లిదండ్రులు భయంభయంగా ఇళ్లలో ఉంటున్నారు. ఈ నెల 4వ తేదీన సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థి తరుణ్‌ను రాత్రి పూట కొడుతూ, ట్రంకు పెట్టె తీసాడని వేధించడంతో తరుణ్ కిటికీని చేతితో కొట్టడంతో చేతికి బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో సిబ్బంది ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం కరీంనగర్‌లో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. మరొక విద్యార్థిని ప్రిన్సిపాల్ మందలించినందుకు ప్రిన్సిపాల్ కొట్టాడని స్థానిక పోలీస్ స్టేషన్‌లో విద్యార్థి తండ్రి ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసులు కళాశాలకు వెళ్లి విచారణ చేసి పరిశీలించినట్లు తెలుస్తోంది.

అధికంగా విద్యార్థులు..

కళాశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. హైస్కూల్ విద్యార్థులు 450మంది, కళాశాల విద్యార్థులు నాలుగు గ్రూపులు కలిపి 350మంది విద్యార్థులు ఉన్నారు. గుడిపేట పాఠశాలకు భవనం సరిపోకపోవడంతో ఐదో తరగతి విద్యార్థులు 80మంది, ఇటర్మీడియట్ విద్యార్థులు 150మంది, తాండూర్ పాఠశాలకు చెందిన ఇటర్మీడియట్ విద్యార్థులు 50మంది ఇక్కడే చదువుకుంటున్నారు. ఒక్క భవనంలో 1080మంది విద్యార్థులున్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగిపోవడంతో ఉపాధ్యాయులకు ఇబ్బందిగా మారింది. సౌకర్యాలకు కూడా కొరత ఏర్పడుతోంది. విద్యార్థులను కంట్రోల్ చేయడానికి ప్రిన్సిపాల్‌కు, ఉపాధ్యాయులకు సవాలుగా మారుతోంది. కొద్ది రోజుల క్రితం కొంతమంది విద్యార్థులు క్రమశిక్షణ లేకుండా ఉండడంతో, వారికి టీసీలు ఇచ్చి పంపించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులను క్రమశిక్షణతో పెంచి, మంచి విద్యను అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం



సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులను కొడుతున్నారని సమాచారం ఉంది. చర్యలు తీసుకుంటున్నాం. తరుణ్ అనే విద్యార్థి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. క్రమశిక్షణ పాటించని విద్యార్థులపై చర్యలు తీసుకొని, మంచి విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం.

– రోనాల్డ్ కిరణ్, ప్రిన్సిపాల్, లక్సెట్టిపేట

అటెన్షన్ ప్లీజ్.. ప్రమాదంలో ప్రహరీ



మంచిర్యాలక్రైం: జిల్లా అటవీ శాఖ కార్యాలయానికి చెందిన ప్రహరీ కింది భాగం కూలింది. భారీ వర్షం కొడితే ప్రహరీ మొత్తం కూలే అవకాశం ఉంది. ప్రహరీ పక్కనే కార్లు, ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేస్తారు. ప్రమాదవశాత్తు గోడ కూలితే, పెద్ద ప్రమాదం సంబవించే అవకాశాలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు జరిపించాలని ప్రజలు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి : శివ్ ఆశీష్ సింగ్, జిల్లా అటవీ శాఖ అధికారి

– ఫోన్ నంబర్ : 9440810100

ఘనంగా ‘పుంజాల’ జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం మంచిర్యాలలో బీసీల జాతిపిత పుంజాల శివశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా శివశంకర్ చిత్రపటానికి మున్నూరు కాపు ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇత్యాల కిషన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపులు మాట్లాడుతూ.. బీసీల అభ్యున్నతికి పుంజాల శివశంకర్ చేసిన కృషిని వివరిస్తూ బీసీల అభివృద్ధే లక్ష్యంగా పాటుపడిన ఆయనను స్ఫూర్తిగా తీసుకొని బీసీల అభివృద్ధి కోసం ఏకతాటిగా నడవాలన్నారు. కార్యక్రమంలో మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యులు శ్రీపతి సురేశ్, బొడ్డు శ్రావణ్, ఆకుల లక్ష్మినారాయణ, బుచ్చన్న, సందీప్, శివ, సాహితీ, శ్రీనివాస్, కుమార్, సదయ్య, మున్నూరు కాపు రాష్ట్ర కార్యదర్శి, జిల్లా గౌరవ అధ్యక్షుడు గొంగళ్ల శంకర్ పాల్గొన్నారు.

నక్కలపల్లి లోతొర్రెపై వంతెన నిర్మించాలి



ధ్వంసమైన లోతొర్రె వంతెనను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

కోటపల్లి: వర్షాల కారణంగా దెబ్బతిన్న నక్కలపల్లి లోతొర్రెపై బ్రిడ్జిని నిర్మించి, చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరుతూ కూలిన వంతెనను శనివారం బీజేపీ నాయకులు పరిశీలించి ప్రభుత్వాన్ని, స్థానిక ఎమ్మెల్యేను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. 15రోజుల క్రితం వాగుకు మరమ్మతులు చేస్తానని చెప్పి ఇప్పటివరకు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఇకనైనా వెంటనే మరమ్మతులు చేసి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు పెద్దింటి పున్నం, నాయకులు దుర్గం నర్సింహులు, కందుల వెంకటేశ్, పెద్దింటి లచ్చన్న, మహేశ్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

నేతకానీలకు సముచిత స్థానం కల్పించాలి



సమావేశమైన నేతకాని సంఘ నాయకులు

దండేపల్లి: ఎస్సీ వర్గీకరణలో నేతకానీలకు సముచిత స్థానం కల్పించాలని, నేతకాని సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల రాజమల్లు డిమాండ్ చేశారు. దండేపల్లిలో శనివారం సంఘనాయకులతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడాతూ.. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూల తీర్పు ఇచ్చిందని, ఇందులో భాగంగా ఎస్సీ వర్గీకరణలో నేతకానీల వాటా కోసం మనమంతా ఐక్యతగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం గ్రామగ్రామాన కమిటీలు వేసుకుని, సంఘాన్ని బలోపేతం చేసుకోవాలన్నారు. మండల ఇన్‌చార్జిలు ఇసాకర్, సాయికుమార్, నాయకులు శేఖర్, గంగన్న, రాజలింగు, రవి, తిరుపతి, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలి’



మాట్లాడుతున్న జాడి దేవరాజ్

పాతమంచిర్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్‌లో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పేద ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం వహించడంతో పేదలకు రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, ఇతర సంక్షేమ పథకాలు అందకుండా పోయాయన్నారు. కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. హామీలు అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 12న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రమాదేవి, బాబురావు, రాజేందర్, పోషన్న, ఆదిలక్ష్మి, రజిత, లక్ష్మి పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలు శుద్ధి



కోటపల్లి: నివాళులర్పిస్తున్న దుర్గం అశోక్



భీమారంలో క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



దండేపల్లిలో గాంధీ విగ్రహాన్ని శుద్ధిచేస్తూ...

మంచిర్యాలటౌన్: బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని మహనీయుల విగ్రహాలను బీజేపీ నాయకులు శనివారం శుద్ధి చేసే కార్యక్రమాలను నిర్వహించారు. ఐబీ చౌరస్తాలో గల డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం, ఓవర్ బ్రిడ్జి వద్ద స్వామి వివేకానంద విగ్రహం, బైపాస్ రోడ్డులోని తెలంగాణ తల్లి విగ్రహాలను శుద్ధి చేసి పూలమాలలను వేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేశ్వర్, శ్రీదేవి, లచ్చన్న, జయరామరావు, అశోక్, రాకేశ్ రెన్వా, సతీశ్, శ్రీనివాస్, శ్రీధర్, నాగేశ్వర్‌రావు, రాజన్న, సరస్వతి పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు స్వామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అశ్విన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: బీజేపీ పిలుపు మేరకు దండేపల్లిలో జాతిపిత మహాత్మాగాంధీ, అంబేద్కర్ విగ్రహాలను బీజేపీ నాయకులు శనివారం శుద్ధిచేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజయ్య, నాయకులు ప్రభాకర్, రవిగౌడ్, సురేందర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సత్తయ్య, సురేష్ పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని కొండాపూర్‌లో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ఆదివాసీ అమరవీరులు కొమురంభీం విగ్రహాన్ని శుద్ధి చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంపత్‌కుమార్, యువమోర్చ అధ్యక్షుడు తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి ప్రసన్న, బాల్‌రాజ్, నాయకులు పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి శనివారం బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంగా నియోజకవర్గం ఇన్‌చార్జి ఏల్పుల సతీష్, మండల బీజేపీ అధ్యక్షుడు బొర్లకుంట శంకర్, ప్రధాన కార్యదర్శులు మాడెం శ్రీనివాస్, మహిళా మోర్చా నాయకురాలు మేడి విజయ తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: మండల కేంద్రంలో భారత రాజ్యాంగా నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని శనివారం బీజేపీ నాయకులు శుద్ధి చేశారు. క్షీరాభిషేకం చేసి, పుష్పాంజలి ఘటించారు. బీజేపీ మండల అధ్యక్షుడు దూడపాక భరత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణదేవరాయలు, ఎస్సీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి, నాయకులు తుకారాం, మహేందర్ గౌడ్, పుట్టకుమార్, దుర్గ చరణ్, చందు తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

కోటపల్లి: మండలంలోని మల్లంపేట గ్రామంలో బీజేపీ జిల్లా కన్వీనర్ దుర్గం అశోక్ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహ పరిసరాలను శుభ్రం చేసి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య, కన్వీనర్ అక్కల రమేశ్, పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.



కొండాపూర్‌లో కొమురంభీం విగ్రహాన్ని శుద్ధిచేస్తూ..



జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో...



తాండూర్: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పారిశుధ్య కార్మికులకు రక్షణ పరికరాలేవి..?



మందమర్రి ఏరియాలోని వాడల్లో పారిశుధ్య నిర్వహణ పనులు చేస్తున్న సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు రక్షణ పరికరాలైన లాంగ్ షూస్, చేతి గ్లౌజులు, రెయిన్ కోట్ లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. నిబంధనల ప్రకారం సీజన్ మొదలు కావడంతోనే కాంట్రాక్టర్ వారికి రక్షణ పరికరాలు అందించాల్సి ఉన్నా, సరఫరా చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్టర్ వెంటనే వర్షాకాలం అందించాల్సిన రక్షణ పరికరాలను వెంటనే అందించాలని, ఏరియా జీఎం చొరువ చూపాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

– మందమర్రిరూరల్

వరినాట్లకు వలస కూలీలు!



దండేపల్లి: వానాకాలం సాగులో భాగంగా దండేపల్లి మండలంలో వరినాటు పనులకు బీహార్, బెంగాల్, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన కూలీలు వలసొచ్చారు. గతంలో నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు వచ్చే వలస కూలీలు, ఈసారి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు కూడా వచ్చారు. మహిళలు, పురుషులు అందరూ వరినాట్లు వేస్తున్నారు. ఇక్కడ వరినాట్లు కేవలం మహిళలు మాత్రమే వేస్తారు, వలస కూలీలు, మహిళలతో పాటు, పురుషులు కూడా నాట్లు వేయడం ఇక్కడి వారికి కొత్తగా అనిపిస్తుండటంతో కొందరు వింతగా చూస్తున్నారు. దండేపల్లి మండలం మామిడిపల్లి శివారులో ఓ పొలంలో వలస కూలీలు నాటు వేస్తుండగా ‘సాక్షి’ క్లిక్ మనిపించింది.

‘వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి’

మంచిర్యాలఅర్బన్: బెల్లంపల్లి పట్టణంలో ఎస్టీ హాస్టల్‌లో విద్యార్థులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు చరణ్, శ్రీకాంత్ డిమాండ్ చేశారు. విద్యార్థులు, వర్కర్లపై దురుసుగా వ్యవహరిస్తున్న వార్డెన్‌పై విచారణ జరిపి విధుల నుంచి తొలగించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

పేరెంట్స్ కమిటీ నియామకం

లక్సెట్టిపేట: స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీని ఎన్నుకున్నట్లు ప్రిన్సిపాల్ లలితాకుమారి శనివారం తెలిపారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా సరిత, ప్రధాన కార్యదర్శిగా మాణిక్యం, అసిస్టెంట్ ప్రధాన కార్యదర్శిగా మురళి, జాయింట్ సెక్రటరీగా మురళి, కోషాధికారి సుజాత, సలహాదారులుగా పలువురు ఎన్నికయ్యారు.

సెలవురోజు తరగతులు

మంచిర్యాలఅర్బన్: రెండో శనివారం విద్యాసంస్థలు అన్నీ సెలవు దినంగా పాటించాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను ప్రైవేట్ పాఠశాలలు అమలుపర్చటం లేదని ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ అజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజున తరగతుల నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలి



డీఈకి వినతిపత్రం ఇస్తున్న ఆకాష్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ 21వార్డు బూడిదగడ్డ బస్తీలోని సింగరేణి క్వార్టర్లు ఉన్న వీధుల్లో ఎన్‌పీడీసీఎల్ కరెంట్ స్తంభాలను ఏర్పాటు చేసి అవసరమైన వ్యక్తులకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ వార్డు ఇన్‌చార్జి ఎలుక ఆకాష్ కోరారు. బెల్లంపల్లి విద్యుత్ డీఈ రాజన్నకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంపెనీ క్వార్టర్లలకు కరెంట్ కనెక్షన్ తీసుకోవడానికి ప్రభుత్వ పరంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ మేరకు డీఈ రాజన్న వెంటనే స్పందించి ఏఈ శ్రీనివాస్ ఇతర సిబ్బందిని బస్తీకి సర్వే కోసం పంపించారు. కార్యక్రమంలో బస్తీ వాసులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్‌లో శ్రీభగవద్గీత అధ్యయన మండలి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ, డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ సుగుణాకర్ రెడ్డి కాలనీ ప్రజలకు వైద్య పరీక్షలను నిర్వహించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి నెలా 4వ ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీభగవద్గీత అధ్యయన మండలిలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు హోమియో మందులను అందించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బదావత్ ప్రకాశ్‌నాయక్, యగ్గన మల్లేశ్, చందూరి ప్రభాకర్, బెక్కం రాజారావు, సంపత్, రాములు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడిపై ఫిర్యాదు

జైపూర్: మంచిర్యాల పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గోగు రవీందర్ రెడ్డి, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, బీజేపీ కేంద్ర మంత్రి అమిత్‌షాను కలిసినట్లుగా సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుకు కాంగ్రెస్ నాయకులు చల్ల విశ్వంబర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు.

సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న జిల్లా సీనియర్ నాయకుడు

చెన్నూర్: మున్సిపాలిటీ పార్టీ బలోపేతం కోసం స్థానిక సమస్యలపై పోరాటం చేసేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు కాశెట్టి నాగేశ్వర్‌రావు అన్నారు. బీజేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన పట్టణ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి అధికార పార్టీపై ఒత్తిడి తెచ్చేలా పోరాటాలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆగష్టు 15న ఘర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, మాజీ ఏఎంసీ చైర్మన్ బత్తుల సమ్మయ్య, పట్టణ అధ్యక్షులు జాడి తిరుపతి, లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు కమ్మల శ్రీనివాస్, కేవీఎం శ్రీనివాస్, గర్రెపల్లి వెంకటనర్సయ్య, వంశీకృష్ణ, తుమ్మ శ్రీపాల్, రాజు, వంశీ, మద్ద మధూకర్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

శ్రీరాంపూర్: నస్పూర్ మున్సిపాలిటీలోని 9వ వార్డు వాటర్ ట్యాంక్ ఏరియాలో రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శనివారం ఈ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు కుర్రె చక్రవర్తి ప్రారంభించారు. పలువురు కాలనీవాసులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. అవసరమున్న వారికి మందులు, కళ్లజోళ్లు కూడా అందిస్తున్నామన్నారు. ఫౌండేషన్ తరుపున అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు క్రాంతి, అజయ్, సీతారాం సాత్విక్, కిట్టన్న పాల్గొన్నారు.